క్లుప్తంగా

విద్యార్థులు పద్యాలను అర్థం చేసుకోవాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యార్థులు తెలుగు నీతి పద్యాలను అర్థం చేసుకోవాలని ఏపీ పేపరుమిల్లు విశ్రాంత ఇంజనీర్ పిచ్చుక వెంకటరాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం చదువు ప్రాముఖ్యత, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పలితాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పిచ్చుక వెంకటరాంబాబు, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఇంజనీర్ ప్రసాద్, విశ్రాంత స్కూల్స్ సూపర్‌వైజర్ వెంకటసత్యనారాయణ, పవర్ ఎయిడెడ్ స్కూల్ టీచర్ జి.రాజు మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణ అలవాటు చేసుకుని మెలగాలని అన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ చాగంటి వెంకట లక్ష్మీనరసింహారావు, ట్రస్ట్ సభ్యులు మతల రమేష్, మెరపల శ్రీనివాసరావు, ,గ్రంథాలయాధికారిణి శ్రీదేవి పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల్లో రక్తదానం పట్ల ఉన్న అపోహలు తొలగించి అందర్నీ రక్తదాతలుగా మార్చడానికి అన్ని ప్రాంతాల్లో రక్తదాన శిబిరాల్ని ఏర్పాటు చేస్తున్నామని మన బాధ్యత ఫౌండేషన్ అధ్యక్షుడు గారా అజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలో క్వారీ మార్కెట్ సెంటర్‌లో బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంజీవని వలంటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. గారా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు రక్తదానం పట్ల భయాన్ని వదలి ఒక ప్రాణాన్ని కాపాడుతున్నాం అనే స్ఫూర్తితో రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న అనేక మంది ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. ఫౌండేషన్ ద్వారా మరిన్ని రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గారా శ్రీవిద్య, రామకృష్ణ, సుధాకర్, హారిక, శ్రీకాంత్, జ్యోత్స్న, శిరీష, రాజేష్, సంజీవని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రాజు, మేఘన, రాజు, నాని పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహనకు కృషి



డయాబెటిక్ స్కీనింగ్ అవేర్ నెస్ క్యాంపు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: మధుమేహంపై అవగాహనకు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దుల వీఎస్ శ్రీరామ్ గుప్త పేర్కొన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఓఎన్‌జీసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ బిల్డింగ్‌లో డయాబెటిక్ స్క్రీనింగ్ క్యాంపు, డయాబెటిక్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. యోగా క్లాసులకు వచ్చే సుమారు 100 మందికి డాక్టర్ అశోక్‌కుమార్ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన శైలి డయాబెటిస్ రోగులు పెరగడానికి కారణమవుతోందన్నారు. ఈ నెలలో వచ్చిన ప్రపంచ డయాబెటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 10 ప్రదేశాలలో 1,500 మందికి డయాబెటిక్ స్క్రీనింగ్, అవేర్నెస్ క్యాంప్స్ నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. యోగా మాస్టర్ బిక్కిన శివ, క్లబ్ అడ్మిన్ గ్రంథి లక్ష్మి వసంత కుమారి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక సీతంపేటలో యువతి (19) అదృశ్యమైన ఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. యువతి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమార్తె తిరిగి రాకపోవడంతో తల్లి చుట్టుపక్కల వారిని, బంధువులను ఆరా తీసింది. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సినిమాలు

శ్యామల	: కంగువా
సూర్యమినీ	: వెనమ్,సింగం ఎగైన్
సూర్యప్యాలెస్	: కంగువా
శివజ్యోతి	: మట్కా
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీభాస్కర్
రాజా	: మట్కా
రంభ	: బఘీరా
ఊర్వశి	: కంగువా
మేనక	: జితేందర్‌రెడ్డి,జాతర
కుమారి	: దేవర
అప్సర	: మట్కా
నామవరం	
వీఎస్.మహల్	: కంగువా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మట్కా
కడియం	
వెంకటసూర్య	: కంగువా

కార్మికులకు వరం... ఈ-శ్రమ్ కార్డులు





దేవీచౌక్ సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి, సహాయ కార్మిక కమిషనర్ వలి తదితరులు, హాజరైన కార్మికులు

- దేశంలో ఎక్కడైనా లబ్ధి పొందేలా ప్రణాళిక
- ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా ఉచితంగా నమోదు
- ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.2 లక్షలు
- శాశ్వత అంగవైకల్యం పొందితే రూ.లక్ష సాయం

సీటీఆర్ఐ: వలస, అసంఘటిత కార్మికుల ఇబ్బందులు, కష్టాలను పరిగణలోకి తీసుకుని సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కేంద్రం ప్రభుత్వం సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ఆధార్ కార్డు తరహాలో దేశంలో ఎక్కడికి వెళ్లినా ప్రయోజనం చేకూరేలా యూఏఎన్(యూనివర్సిల్ అకౌంట్ నంబర్)తో కూడిన ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి క్షేత్ర స్థాయిలో కార్మిక శాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 5,45,810 మందికి పైగా అసంఘటిత కార్మికులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు 3,18,014 మందికి గుర్తింపు కార్డులు జారీచేశారు. జిల్లాలో కొన్ని యూనియన్‌ల ఆధ్వర్యంలో ఈ -శ్రమ్ కార్డుల నమోదు కోసం అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్మికులకు కార్డు ప్రయోజనం తెలియజేసి నమోదు చేసుకొనే విధంగా యూనియన్లు చర్యలు తీసుకుంటున్నాయి. ఒక్క రాజమహేంద్రవరంలోనే సుమారు 25 వేల మంది కార్మికులు ఉన్నారని అంచనా. వారిలో ఇప్పటి వరకు సుమారు15 వేలకి పైగా ఈ-శ్రమ్ కార్డులు నమోదు చేయించుకున్నారు.

ఉచిత నమోదుకు అర్హులు వీరే...

16 నుంచి 59 ఏళ్ల వయసు కలిగి ఈఎస్ఐ, ఈపీఎఫ్‌కు అవకాశం లేని కార్మికులు దీనికి అర్హులు. భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, చిన్న, సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషణలో నిమగ్నమైనవారు, బీడీ రోలింగ్ చేసేవారు, తోలు కార్మికులు, వడ్రంగి పనివారు, ఉప్పు కార్మికులు, ఇటుక బట్టీలు, రాతి క్వారీ, సామిల్లుల్లో పనిచేసేవారు నమోదు చేయించుకోవచ్చు. క్షురకులు, కూరగాయలు, పండ్ల విక్రేతలు, వార్తాపత్రికల విక్రేతలు, రిక్షా కార్మికులు, ఆటోడ్రైవర్లు, చర్మశుద్ధి కార్మికులు, వీధి వర్తకులు, ఆశ వర్కర్స్, అంగన్వాడీ వర్కర్స్ తదితర అసంఘటిత కార్మికులు అర్హులు.

నమోదు ఇలా...

ఈ పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకొనేవారు ఎటువంటి రుసుం చెల్లించనక్కర్లేదు. కార్మికుని ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు (ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో సహా), బ్యాంకు, ఆధార్ కార్డుతో లింకేజీ కలిగిన ఫోన్ నంబర్ ఉండాలి. సమీప సీఎస్‌సీ సెంటర్స్, పోస్టు ఆఫీస్, గ్రామ/వార్డు సచివాలయాలలో నమోదు చేస్తారు. కార్మిక శాఖ కార్యాలయాల్లో లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ఈ పథకం వల్ల లాభాలు

అసంఘటిత కార్మికులు సామాజిక భద్రతా చట్టం కింద సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతారు. వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను అందించడానికి ఉపయోగపడుతుంది. ఆర్థిక సహాయం నేరుగా వారి బ్యాంక్ అకౌంట్‌కి జమ అవుతుంది. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.2 లక్షలు, శాశ్వత అంగవైకల్యం పొందితే వారికి రూ.లక్ష సహాయం అందుతుంది.

నమోదు చేసుకోవాలి...

యూఏఎన్ గుర్తింపు కార్డుల కోసం లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. దీని ద్వారా అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు ఉచితంగా అందజేస్తాం. కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ఈ కార్డులు అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత కోసం, ఆర్థిక సహాయం కోసం ఉపయోగపడతాయి.

– టీఎస్ఎం వలి, కార్మిక శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి, సహాయ కార్మిక కమిషనర్

వలస కార్మికులకు రేషన్ కార్డుల జారీ

కంబాలచెరువు: పొట్ట చేతపట్టుకుని వేరే రాష్ట్రాల నుంచి ఇక్కడికి పనుల కోసం వచ్చిన వారికి ఒక్కోసారి పస్తులుండవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే వలస కార్మికులకు రేషన్ కార్డు మంజూరు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో దరఖాస్తు చేసుకున్న వెంటనే రేషన్ కార్డు జారీ చేస్తున్నారు. శని,ఆదివారాల్లో ఈ శ్రమ్ కార్డు గురించి రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో విస్తృత ప్రచారం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, కార్మికశాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్, టీఎస్ఎం వలి, గోదావరి ఎలక్ట్రికల్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రామకృష్ణ, ఆఫీసర్లు లలిత కుమారి, జబీన పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌తో చక్కటి వ్యాయామం



విజేతలతో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: స్విమ్మింగ్‌తో చక్కటి వ్యాయామం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ఆదివారం స్థానిక హైవేలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌లో స్పోర్ట్స్ షోరూం ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్విమ్మింగ్ ఒక క్రీడగానే గాక, మానసిక, శారీరక దృఢత్వానికి దోహదపడుతుందన్నారు. స్విమ్మింగ్ పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ బిబ్లాకు పాతపేటలో వేంచేసియున్న శ్రీగణపతి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం ఆదివారం గుడిని ర్మాణకర్త బత్తినఅప్పారావు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి భక్తుల చేతులమీదుగా పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గౌరీచంద్రమౌళీశ్వర స్వామి ఆలయం చుట్టూ వెలిగించిన దీపాలు

వైభవంగా లక్ష దీపోత్సవం



కొలను వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో అలరారుతున్న స్వామి

గౌరీచంద్రమౌళీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని గౌరీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి లక్షదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణం, కొలనుచుట్టూ దీపాలు కనువిందు చేశాయి. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం ప్రాంగణం కిటకిటలాడింది. ముందుగా గౌరీచంద్రమౌళీశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు. లక్ష దీపోత్సవంలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



ఆల్కాట్‌తోట గ్రంథాలయంలో గీసిన చిత్రాలతో విద్యార్థులు



కడియంలో తాము వేసిన డ్రాయింగ్స్ చూపుతున్న విద్యార్థులు

చిత్రలేఖన పోటీలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆల్కాట్‌తోట శాఖాగ్రంథాలయంలో ఆదివారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలల్లో వివిధ పాఠశాలల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖన పోటీలకు న్యాయనిర్ణేతగా హర్షవర్ధన స్కూల్ డ్రాయింగ్ టీచర్ శ్రీదేవి వ్యవహరించారని గ్రంథాలయాధికారిణి కొత్తపల్లి రమ్యశ్రీ తెలిపారు.

కడియంలో..

కడియం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సభ్యులు యాగన రాజేశ్వరరావు జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. బొర్రా రమాకృష్ణ డ్రాయింగ్ మెటీరియల్‌ను అందజేసి పోటీలు మొదలు పెట్టారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. సంస్కృతి, సంప్రదాయాలు అంశంపై జరిగిన ఈ పోటీల్లో విజేతలను ఎంపిక చేశారు. భాస్కర్‌రావు, చిలుకూరు వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



జిత్‌మోహన్‌మిత్ర, వెంకట్రావు, శాంతకుమార్‌ను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే రౌతు, ఎస్వీ రామారావు, కుందా మాస్టారు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళా పరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు సహస్ర చంద్రదర్శనం సందర్భంగా హైదరాబాద్ యువకళావాహిని నిర్వహణలో జిత్ మోహన్‌మిత్ర కళావేదిక సహకారంతో ఆదివారం స్థానిక విక్రమ హాలులో కళాకారులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రోటేరియన్ పట్టపగలు వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సినీ విజ్ఞాన విశారద ఎస్వీ రామారావు, దేవి ఉపాసకులు కుందా మాస్టారు ముఖ్యఅతిథులుగా పాల్గొని కళాకారుల సేవలను కొనియాడారు. నట గాయకులు శ్రీపాద జిత్‌మోహన్ మిత్ర, జంగారెడ్డిగూడెం జానపద కళాకారులు యడ్ల వెంకట్రావు, కత్తిపూడికి చెందిన యాక్టర్, సింగర్ ఏడిద శాంత కుమార్ బాబును ఘనంగా సత్కరించారు. మిమిక్రీ చిట్టిబాబు, సామ్రాట్ తమ ప్రదర్శనలతో అలరించారు. కళారత్న పి.వి.యస్.కృష్ణారావు, జామలాపురం రాధాకృష్ణ ; ముద్రగడ ఏసుబాబు, హమీద్, వి.జగపతి, ఏ ఎస్. ఆనంద్, పోస్టల్ ప్రసాద్, గుంటూరు శ్రీనివాసరావు, సుక్కురెడ్డి శ్రీనివాసరావు, డి ఎస్. శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఎక్కడి ఇసుక అక్కడే!

- వంగలపూడి రీచ్‌లో రెండో రోజూ నిలిచిన తవ్వకాలు
- ర్యాంపులో వంటా వార్పు చేపట్టిన కూలీలు
- స్టాక్ పాయింట్ వద్ద సరకు లేక నిలిచిన లారీలు



వంగలపూడి ఇసుక ర్యాంపులో వంటావార్పు చేపట్టిన ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీలు

సీతానగరం: మండలంలోని వంగలపూడి రీచ్‌లో రెండో రోజు ఆదివారం ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. కూలీలు వంటావార్పు కార్యక్రమం చేపట్టి మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లేక అధిక సంఖ్యలో లారీలు ర్యాంపులో నిలిచి ఉన్నాయి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వంగలపూడి ర్యాంపులో నాలుగు రోజులు ఇసుక తవ్వకాలు సజావుగా సాగాయి. గోదావరి పరివాహక ప్రాంతంలో కూలీలు ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లపై ఎగుమతి చేసి, అక్కడ నుంచి స్టాక్ పాయింట్ వద్ద ఇసుక డంప్ చేశారు. ట్రాక్టర్‌కు రూ.150, కూలీలకు రూ.200 ర్యాంపు నిర్వాహకులు చెల్లిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు ఇసుకను స్టాక్ పాయింట్ వద్దకు తరలించడానికి ఇచ్చే ధర గిట్టుబాటు అవ్వడం లేదని, ట్రాక్టర్ ఒక్కొంటికి రూ.250, కూలీలకు రూ.250 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. దీంతో ర్యాంపు నిర్వాహకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంతో కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు ఆదివారం ఉదయం నుంచి ర్యాంపు వద్దకు చేరకుని వంటా వార్పు కార్యక్రమం చేపట్టి, మధ్యాహ్నం భోజనాలు ర్యాంపు వద్ద చేశారు. ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీలు విలేకరులతో మాట్లాడుతూ ర్యాంపు నిర్వాహకులు చెల్లించే ధర గిట్టుబాటు అవ్వడం లేదని, రేటు పెంచాలని కోరుతుంటే, ఇప్పటికే ర్యాంపులో రూ.25 లక్షలు ఇచ్చానని ర్యాంపు నిర్వాహకులు అంటున్నారని, అన్ని రూ.లక్షలు ఎవరికి ఇచ్చారనేది తెలపాలని డిమాండ్ చేశారు. స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలు ర్యాంపులో నిలిపి ఉంచారు. కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లతో ర్యాంపు నిర్వాహకులు చర్చలు జరిపి, సమస్య పరిష్కరిస్తారని లారీ డ్రైవర్లు ఎదురుచూస్తున్నారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీల సమస్యపై ర్యాంపు నిర్వాహకులతో మాట్లాడామని, కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు ధర పెంచాలని అంటున్నారని, ర్యాంపు నిర్వాహకులు ఒప్పుకోవడం లేదని చెప్పారు. ఈ విషయం జేసీ దృష్టిలో ఉంచామన్నారు.

వన సమారాధనలు ఐక్యతకు ప్రతీకలు



బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో సత్కారాన్ని అందుకున్న జక్కంపూడి రాజా



పుష్కర వనంలో జరిగిన వన సమారాధనలో పాల్గొన్న మాజీ ఎంపీ భరత్‌రామ్

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- ఎయిర్‌పోర్టు రోడ్డులో వన సమారాధనల సందడి

మధురపూడి: వన సమారాధనలు సామాజిక ఐక్యతకు ప్రతీకలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం ఎయిర్‌పోర్టు సమీపంలోని తోటల్లో జరిగిన వనసమారాధనలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బూరుగుపూడి జంక్షన్ సమీపంలోని తోటలో జరిగిన లక్ష్మీ నరసింహ గాయత్రీ బ్రాహ్మణ సమాఖ్య నాయకుల ఆధ్వర్యంలో సమారాధనలో సంఘం నాయకులు కొత్తపల్లి భాస్కరరామ్, ఆర్. ప్రవీణ్‌కుమార్, మరంగంటి శ్రీను తదితరులు రాజాను శాలువా, పూలమాలలతో సత్కరించారు. బూరుగుపూడిలో జరిగిన శ్రీశ్రీ శివసాయి కాపు సంక్షేమ సంఘం నాయకులు కట్టా వీరసూరి, మేడిన దుర్గారావు ఆధ్వర్యంలో జరిగిన సమారాధనలో పాల్గొన్నారు. చందన రమేష్ గార్డెన్స్‌లో జరిగిన గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం సమారాధనలో రాజా పాల్గొన్నారు. ఈ వన సమారాధనల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో...

రాజానగరం: సమాజంలో కుల, మతాలకు అతీతంగా విభిన్న వక్తులు, కుటుంబాల మధ్య సమైక్యతను పెంపొందించేందుకు వన సమారాధనలు తోడ్పడుతుంటాయని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. లాలాచెరువు గోదావరి మహాపుష్కర వనంలో రాజమండ్రి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి వాసు, సీసీ చానల్ ఎండీ కొండలరావు, సినీనటుడు భద్రం హాజరయ్యారు. ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు శ్రీరామ్మూర్తి, సారథి, శ్రీనివాస్, గణేష్, దుర్గారావు పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాల్లో..

మండలంలోని చక్రద్వారబంధంలో కమ్మ సామాజిక వర్గం, రాజానగరంలోని ముత్యాలమ్మ వారి ఆలయం వద్ద కాపు సామాజిక వర్గం ఆధ్వర్యంలో వన సమారాధనలు జరిగాయి. దివాన్‌చెరువులోని డీవీబీ రాజు లేఅవుట్‌లో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), సినీదర్శకుడు దండు కార్తీక్‌వర్మ, రచయిత, దర్శకులు ఎం.కుమార్‌రాజు, సినీనటుడు సూర్యతేజ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన సత్యనారాయణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు.

అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘ వన సమారాధన

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 33వ కార్తిక వన సమారాధన మహోత్సవం ఆదివారం కోలమూరులోని శ్రీశ్రీశ్రీ సదానంద ఆశ్రమం ఎదురుగా ఉన్న సాయిరామ మందిరంలో సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. రుద్రహోమం, పూజాధికాలు, ఆటపాటలు, భోజనాలతో ఆ ప్రాంతమంతా కోలహలంగా మారింది. సంఘ సభ్యులు రాచర్ల దుర్గాప్రసాద్, జొన్నలగడ్డ సత్య శ్రీనివాస్, బులుసు శ్రీరామచంద్రమూర్తి, బొడ్డపాటి సుబ్బలక్ష్మి, శ్రీనివాస్, ఏఎస్ఎన్ మూర్తి కార్యక్రమాలను పర్యవేక్షించారు.